# సౌమ్యగీతం

తుషార బిందువులతో తడిసిన పారిజాతంలా వుంది సౌమ్య. తలస్నానం చేయడంతో రాత్రి డ్యూటీ అలసట కొంచెం తీరింది. కానీ కళ్ళు మాత్రం విడనంటున్నాయి. బలవంతాన కళ్ళు విప్పుకుని అన్నం తినసాగింది.

"బేబీ! శైలేంద్ర నాన్నగారు లెటరు వ్రాశారు. వాళ్ళందరికీ నువ్వు బాగా నచ్చావట." సౌమ్య నిద్రమత్తు ఒక్కసారి ఎగిరిపోయింది. ఆమె హృదయంలో సంతోష తరంగం ఉవ్వెత్తున లేచింది.

"నీ అదృష్టం కొద్దీ రాజా లాంటి సంబంధం దొరికింది. మీ నాన్నగారికి కొండంత బరువుని గుండెల మీద నుంచి దింపుకున్నట్లుగా వుంది. తప్పిపోయిన సంబంధాలన్నీ మనమంచి కోసమే తప్పిపోయాయనిపిస్తూంది." కమల తన ధోరణిలో చెప్పుకుపోతూంది. సౌమ్య తల్లి చెప్పేది వినడం లేదు. ఎక్కడికో రెక్కలు విప్పుకుని ఎగిరి పోతూందామె హృదయం.

"సౌమ్యా! పెళ్ళి చూపులంటూ నేను చూస్తున్న మొదటి అమ్మాయి మీరు. నా కలల ప్రతిరూపం మీరే అవడం ఎంత అదృష్టం!" మెత్తగా, మధురంగా వున్న శైలేంద్ర మాటలకు సౌమ్య చెక్కిళ్లలో గులాబీలు పూశాయి.

"సౌమ్య! ఎంత అందమైన పేరు... మీ రూపం, చూపులు, ప్రతి కదలిక మీ పేరును సార్థకపరుస్తున్నాయి." అతని అతి చొరవకి విస్తుపోతూంది సౌమ్య.

"చూడగానే 'ఈమె నా స్త్రీ' అనే భావంతో ఊగిపోగల అదృష్టం బహుశా ఈ ప్రపంచంలో నా ఒక్కడికే దక్కింది సౌమ్యా! ఐ ఎడోర్ యూ" భావుకంగా చలిస్తున్న అతని కళ్లని మంత్ర ముగ్ధలా చూస్తూంది సౌమ్య.

"సౌమ్యా! మీకు నేను నచ్చానా? మీరు కాదంటే మీ పాదాల ముందు .."ముఖాన్ని అదోలా పెట్టిన సౌమ్యను చూచి చిలిపిగా నవ్వాడు శైలేంద్ర.

"కంగారు పడకండి, మీ పాదాల ముందు నా పాదాలుంచి యిలానే కుర్చీలో కూర్చొని నిరాహార దీక్ష ప్రారంభిస్తాను" పచ్చిక మీద నుంచి అతని పాదాల వైపు చూపులు తిప్పిన సౌమ్య అధరాలు వికసిస్తున్న మొగ్గల్లా వున్నాయి.

"బేబీ! అన్నం తిను. ఏమిటా ఆలోచన!" ఉలిక్కిపడి పెరుగు కలుపు కోసాగింది సౌమ్య.

"నీ పెళ్లి చాలా గ్రాండ్‌గా చేస్తానంటున్నారు మీ నాన్నగారు. చీరలు తీసుకోడానికి మద్రాస్ వెళ్దాం." కమలమ్మ చీరలు, నగలు గురించి ఏమేమో చెప్తూంది. వాటిని తప్పించుకుని పరుగెత్తసాగింది సౌమ్య హృదయం.

చెయ్యి కడుక్కుని తన రూంలోకి వెళ్లింది సౌమ్య. హాస్పిటల్ నుంచి రాగానే బెడ్ మీదకు విసిరిన ఓవరాల్‌ని స్టాండ్‌కు తగిలించి, స్టెత్‌ని టేబుల్ మీద పెట్టబోతూ దిల్షాద్ లెటర్ చూచింది. మెడిసిన్ ఫస్టియర్ నుంచీ సౌమ్య క్లాస్‌మేట్, వార్డుమేట్, ప్రాణానికి ప్రాణంగా మసలిన ఫ్రెండ్ దిల్షాద్. ఎం.డి.కి మరో ఊరి మెడికల్ కాలేజీలో సీట్ రావడం వల్ల ప్రాణసఖులిద్దరూ విడిపోయారు. దిల్షాద్ దస్తూరి చూడగానే ఆమెను చూచిన సంతోషం కలిగింది. దిల్షాద్, శైలేంద్ర క్లాస్ మేట్స్. అతనిని పెళ్లి చేసుకోబోతున్నందుకు దిల్షాద్ తనని అభినందిస్తూ లెటర్ వ్రాసుంటుందని ఊహిస్తూ లెటరు చదవసాగింది. అంతలో సౌమ్య కళ్ళు వెడల్పుగా అయ్యాయి. గబుక్కున లేచి కూర్చుని ఊపిరి బిగబట్టి లెటర్ని ఆసాంతం చదివింది.

"గుడ్ గాడ్!" అప్రయత్నంగా సౌమ్య చెయ్యి గుండెమీదకు వెళ్ళింది.

నమ్మలేనట్లు మళ్ళీ ఓసారి లెటర్ని చదివింది. దిల్షాద్ వ్రాసింది నిజం కాకపోతే ఎంత బావుణ్ణు. శైలేంద్ర అలాంటి వాడా! అంత చక్కటి కబుర్లు చెప్పిన శైలేంద్ర త్రాగుతాడా! స్త్రీ అంటే ఎంతో ఉన్నతంగా మాట్లాడిన వ్యక్తి ఆడపిల్లల హృదయాలతో ఆటలాడుకుంటాడా! అతని వినసొంపైన మాటలు. సంస్కారం ఉట్టి పడే ప్రవర్తన అంతా నటనేనా? సర్వశక్తులూ హరించుకు పోయినట్లు కూర్చుండి పోయింది సౌమ్య.

"బేబీ..." పరాత్పరరావు కంఠం విని ఉలిక్కిపడింది సౌమ్య. అతని అడుగుల చప్పుడు వింటూ చెమటలు పడుతున్న అరచేతుల్ని చీరకు రాసుకుంది. తన రూమ్‌లోకి రాగానే చటుక్కున లేచి నిలబడింది.

"బేబీ! వాళ్ళ దగ్గర్నుంచి లెటరొచ్చిందని అమ్మ చెప్పిందా?"మృదువుగా అడుగుతున్న తండ్రి వంక ఆశ్చర్యంగా చూచింది సౌమ్య. చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ పేరిట తమని దూరంగా వుంచే తండ్రి కంఠస్వరం వింటే చాలు గజగజలాడిపోటం అలవాటయింది. ఆయన తమతో అరుదుగా మాట్లాడినప్పుడు తలవంచుకు జవాబివ్వటం తప్ప సూటిగా ఆయన వంకచూచే ధైర్యం లేదు. ఆయన ఇంట్లో వున్నంత సేపూ ఇప్పటికీ తప్పించుకు తిరుగుతుంది తను. ఆయనకు తన ఉద్యోగం, హోదా, అంతస్తు గుర్తున్నంతగా పిల్లల మీద మమకారం, వాళ్లని ప్రేమగా చేరదియ్యాలనే ధ్యాస ఉండవని సౌమ్య నమ్మకం. తన పెళ్ళి కుదిరిందన్న సంతోషం ఆయనలో పితృప్రేమని వెలికి తెచ్చినందుకు ఆనంద పడింది.

"కూర్చోండి నాన్నగారూ!" అంది అతి మెల్లగా.

"బేబీ! యూ ఆర్ వెరీ లక్కీ. శైలేంద్ర జెమ్. నూటికొక్కడలాంటి వాడుంటాడు" సౌమ్య హృదయంలో ఓ మూల అసంతృప్తి రాజుకుంటోంది.

"త్వరగా రెడీ అవు. బజారుకెళదాం" ఊగిసలాడుతున్న సౌమ్య చప్పున ఓ నిర్ణయాని కొచ్చింది.

"నాన్నగారూ..!" తండ్రి పాదాల మీద చూపు నిలిపి జంకుగా పిలిచింది సౌమ్య.

"ఏమిటమ్మా" సౌమ్యంగా అడుగుతున్న తండ్రిని చూచి ధైర్యం తెచ్చుకుంది సౌమ్య.

"అతన్ని... శైలేంద్రను... నేను మేరేజ్ చేసుకోను నాన్నగారూ" అప్పటి వరకు ప్రసన్నంగా వున్న పరాత్పరరావు ముఖం కఠినమైంది.

"ఏం? ఎందుకని?" తండ్రి ఉగ్రరూపం చూసి సౌమ్య నోటి వెంట మాట రాలేదు.

"చెప్పు... ఎందుకని చేసుకోవు" గద్దించాడు పరాత్పరరావు. సౌమ్య కళ్ళల్లో కరిగిపోయిన కలలు కన్నీరుగా పొరాడుతున్నాయి. ఇంత ఎదిగాక, ఇంత చదువుకుని కూడా తన మనసులోని మాట కన్నతండ్రితో ధైర్యంగా చెప్పుకోలేని తన పిరికితనం మీద అసహ్యం పేరుకుంటూంది గుండెల నిండా.

"ముంగిలా మాట్లాడవేం? శైలేంద్రకి ఏం తక్కువయిందని ఒద్దంటున్నావు? అతనికంటే గొప్పాడు నిన్ను వెదుక్కుంటూ వచ్చి నెత్తి మీద పెట్టుకుని పూజిస్తాడను కుంటున్నావా?... అది జరగని పని." బద్ధ శత్రువు కన్నా అన్యాయంగా తండ్రిలోని అహంకారం మాట్లాడిస్తూంటే సౌమ్య హృదయం అట్టడుగు పొరల్ని చీల్చుకుని వెలికి వచ్చిన ఓ చిత్రం క్రమేపీ పెరిగి ఆమె హృదయాన్ని ఆక్రమించేసింది. రఘువీర్ వినమ్రంగా దోసిలిచాచి నిలబడి తన ప్రేమ నివేదనని అందుకోమంటున్నాడు. ఇన్నాళ్లూ తండ్రికి జడిసి అతనిని చూడనట్లు నటిస్తూంది. తనని వ్యక్తిగా ఇష్టపడి ఆరాధించే రఘువీర్ తన తండ్రి కంటికి ఆనడని తెలిసి, తండ్రిని ఎదిరించి అతనికి చేరువ కాగలిగే ధైర్యం చెయ్యలేకపోయింది. తనను నెత్తిన పెట్టుకొని పూజించే వ్యక్తి ఒకడున్నాడని తన తండ్రి అహం గుర్తించదు. అసలు ఆడదాన్ని గౌరవించడం, ఆరాధించడం తన తండ్రి లాంటి వాళ్లకు తెలియని విషయం, ఆయన దృష్టిలో భార్య ఒక విలాస వస్తువు. అందమైన భార్య స్టేటస్‌ని పెంచుతుంది, చదువుకున్న అందమైన భార్య ఆ స్టేటస్‌ని మరింత పెంచుతుంది... ఆడపిల్లలంటే ఎంత తక్కువ అభిప్రాయం లేకపోతే ఆయనిలా మాట్లాడ గలుగుతారు? ఏ సంబంధమూ లేని శైలేంద్ర తనను చేసుకుంటాననడం తన అదృష్టంగా పదే పదే ఉద్ఘాటిస్తున్న తన తండ్రి, తనను పొందడం శైలేంద్ర అదృష్టం కాదా అని ఒక్క క్షణం కూడా ఆలోచించడు. తనకేం తక్కువని అతను చేసుకుంటా ననడమే మహాభాగ్యమని మురిసిపోవాలి. సౌమ్య హృదయం అవమానంతో, ఎడతెగని ఆలోచనలతో మండిపోతూంది.

"పిచ్చి వేషాలెయ్యకు. నీ మారేజ్ శైలేంద్రతో జరిగి తీరుతుంది" కఠినంగా ఆజ్ఞాపించి బయటకి వెళ్ళిపోయాడు పరాత్పరరావు. సౌమ్య ముఖం కోపంతో

ఎర్రబడింది. గుప్పిళ్లు బిగుసుకుంటున్నాయి.

"ఏమయిందే? ఎందుకలా కోప్పడుతున్నారు నాన్నగారు?" తండ్రి కూతుళ్ళ సంభాషణని ఒక చెవితో వింటున్న కమలమ్మ భర్త బయటకి వెళ్ళగానే ఆతృతగా సౌమ్య దగ్గరికొచ్చింది. మౌనంగా దిల్షాద్ లెటర్ని ఆమె కిచ్చింది సౌమ్య. చదివి లెటర్ని విసిరేసింది కమల.

"యిలాంటి గాలి కబుర్లన్నీ పోగేసుకుని బంగారంలాంటి సంబంధం వద్దని నాన్నగారి కెదురు చెప్తున్నావన్న మాట" తన భర్త మాటకి ఎదురు చెప్పడాన్ని సహించలేక పోతుందామె.

"గాలి కబుర్లు కావమ్మా. దిల్షాద్ ఎలాంటిదో నీకు తెలియదా! గాలి కబుర్లు పోగేసి చెప్పే మనిషేనా తను? దిల్షాద్, శైలేంద్ర ఒక దగ్గర చదువుతూండడంతో అతని మంచి, చెడు కూడా తనకు తెలుస్తాయి. నాన్నగారు ఆరా తీసిన వ్యక్తులకి అతని సంస్కారపు ముసుగు, నటనే తెలుస్తాయి. దిల్షాద్‌కి అతని నిజస్వరూపం తెలుసు గనుక, నా మేలు కోరేదీ, నా స్వభావం, సెంటిమెంట్స్ తెలిసింది గనుక చేతులు కాల్చుకోకముందే మేల్కోమని హెచ్చరించింది" స్థిరంగా, ధృఢంగా మాట్లాడుతున్న కూతురి వంక ఆశ్చర్యంగా చూచింది కమల. ఎప్పుడూ తల వంచుకుని ముక్తసరిగా రెండు ముక్కలు మాట్లాడి తన పని తను చూచుకునే సౌమ్య వరసగా యిన్ని మాటల్నింత స్పష్టంగా మాట్లాడడం చూచి మతి పోతూందామెకు, అంతలో తన కర్తవ్యం గుర్తుకొచ్చింది.

"ఒకవేళ అది వ్రాసింది నిజమేననుకున్నా యీరోజుల్లో అందులో పెద్ద తప్పేముందే..." తాగడం... తిరగడం... మగవాడి సహజలక్షణాలని ఆమోదించే తల్లితో వాదించాలనిపించలేదు సౌమ్యకు. ఇంట్లో హిట్లర్లా అధికారాన్ని చలాయించే నాన్నగారు బయట కాంప్‌లకు వెళ్ళినప్పుడు ఉమర్ ఖయ్యాంలా మారతారని అమ్మకి తెలిసికూడా కిమ్మనదు. కాంప్‌కి వెళ్లొచ్చినప్పుడల్లా క్రొత్త చీరో, నగో తీసుకురావడం, దాన్ని చూడగానే అమ్మ ముఖం సంతోషంతో వెలిగిపోవడం... తలచుకుంటూంటే కంపరంగా వుంది సౌమ్యకు.

"బేబీ నామాట విను. ఆ అబ్బాయి మంచి సమర్థుడిలా వున్నాడు. అంతకంటే మంచి సంబంధం మనకు దొరకదు. అన్ని సుగుణాలు ఒకడిలో వుండాలంటే కుదరదు. సరిపెట్టుకుపోవాలి కొన్నిటిలో.." అనునయంగా చెప్పసాగింది కమలమ్మ

"అది కాదమ్మా" సౌమ్య మాటల్ని మధ్యలోనే తుంచేసింది కమలమ్మ.

"అనవసరపు వాగుడుతోనూ, తిక్క ప్రశ్నలతోనూ నాన్నగార్ని విసిగించక. నీమాత్రం తెలివితేటలు నాన్నగారికి లేవనుకోకు. నువ్వు సుఖపడితే సంతోషిద్దామనే మా తాపత్రయం కూడా. ఏదో ముళ్లకంపలోకి విసిరేస్తున్నట్లు బాధపడతావేమిటే?"

"సుఖం... సంతోషం... వాటికి మీరిచ్చే నిర్వచనాలు నాకు తెలుసమ్మా! కానీ వాటికి నా భాష్యాలు వేరు." మూగ వేదనతో నలిగిపోయింది సౌమ్య హృదయం.

"అక్కా... బావా... వచ్చినట్టున్నారు నేను వెళ్తున్నా" తల్లి వెళ్లడంతో తీరికగా ఆలోచించుకోడానికి సావకాశం చిక్కింది సౌమ్యకు.

తనకు కాబోయే భర్త త్రాగుబోతూ తిరగుబోతూ అని తెలిసి కూడా సరిపెట్టుకుని తలవంచి తాళి కట్టించుకోవాలీ? కన్నతల్లి యివ్వాల్సిన సలహాయేనా ఇది?

"బేబీ..." పిలుస్తూ లోపలికొచ్చిన అక్క వంక విసుగ్గా చూచింది సౌమ్య.

"ఏమిటే, ఏదో ఆకాశరామన్న ఉత్తరం వచ్చిందట!" అక్క స్వరంలోని ఎగతాళికి ఓర్చుకోలేకపోయింది. సౌమ్య.

"ఆకాశరామన్న ఉత్తరం కాదక్కా! నా ఫ్రెండ్ దిల్షాద్ వ్రాసింది." ముక్తసరిగా జవాబిచ్చింది సౌమ్య.

"ఏం వ్రాసిందేమిటి?"

"అమ్మ చెప్పలేదా?" చురుగ్గా చూసింది సౌమ్య.

"దిల్షాద్ వ్రాసింది నిజమేనని ఏమిటి నమ్మకం" క్రాస్ ఎగ్జామినేషన్ మొదలు పెట్టింది సుధ.

"దిల్షాద్ నా బెస్ట్ ఫ్రెండ్, తనమీద నాకు నమ్మకం లేదంటే నామీద నాకు నమ్మకం లేనట్లే" సుధ ధోరణికి కోపం వస్తున్నా ఓర్పుగా జవాబిచ్చింది సౌమ్య.

"బేబీ! నువ్వొట్టి ఫూలిష్ ఫెలోవే... కాస్త కళ్ళు సరిగ్గా తెరిచి ప్రపంచాన్ని చూడు. త్రాగడం... తిరగడం... ఈనాటి నాగరికత, కాకపోతే ముందుది కొంచెం పబ్లిగ్గా చేస్తే, రెండోది కాస్త రహస్యంగా... యిలాంటి లక్షణాలులేని అనాగరికుల్ని వ్రేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. యింత స్వల్పమైన విషయాల్నిలా భూతద్దంలో పెట్టి చూచి అనవసరపు అర్భాటం చెయ్యడమేమీ బాగోలా. బయట సొసైటీలో తిరిగే మగవాళ్లు...' సుధ చెప్తూంది సౌమ్యకు వినబడడం లేదు. త్రాగడం, తిరగడం

ఈనాటి నాగరికత! ఎంత సిగ్గుచేటు నాగరికత! ఇంత సిగ్గుచేటు విషయాన్నెంత గొప్పగా చెప్పుకుంటున్నారీ చదువుకున్న యువతులు!

"బయట మగవాడెలా ప్రవర్తిస్తే మనకెందుకే? యింటికి వచ్చాక మనతో ప్రేమగా, ఆనందంగా ఉంటున్నాడా లేదా అన్నది ముఖ్యం." అక్క వంక విస్మయంగా చూచింది సౌమ్య. ఇలా ఆలోచించే ఆడవాళ్ళు తనతరంలో కూడా వున్నందుకు సౌమ్యకు సిగ్గుగా వుంది.

"బేబీ ఇలాంటి విషయాల్ని సీరియస్‌గా తీసుకుని పెళ్ళి కొడుకుల్ని వద్దన్నావంటే నీకీ జన్మలో పెళ్ళవదు. కొంచెం నింపాదిగా ఆలోచించు" సౌమ్యని ఆలోచనలకి వదిలి సుధ వెళ్ళిపోయింది.

***

"సౌమ్యా...!" అస్తవ్యస్తంగా పడుకున్న సౌమ్య అపరంజి కంఠం విని లేచి కూర్చుంది.

"రా... కూర్చో" సౌమ్య చెయ్యి తన భుజం మీద పడగానే బాధతో మూల్గింది అపరంజి.

"సారీనే" అంది సౌమ్య నొచ్చుకుంటూ.

"ఫరవాలేదులే" కన్నీళ్ళు మెరుస్తూ వుండగా నవ్వింది అపరంజి.

"బాగా తగిలాయా?" అపరంజి జాకెట్టు తొలగించి చూస్తూ అడిగింది సౌమ్య. ఆమె శరీరం మీద వాతలు చూచి సౌమ్య హృదయం ద్రవించిపోయింది. అపరంజి హైస్కూలు చదువు వరకు సౌమ్యతో కలిసి చదువుకుంది. పైకి చదివించే స్తోమత లేక ఆమెకు పెళ్ళి చేసారు. ఆమె భర్తకి ఏ వ్యసనాలూ లేవు, ఒక్క అపరంజిని చితకతన్నడం తప్ప. అర్థంలేని అనుమానాలతో... అసహనంతో ప్రతి చిన్న విషయానికి అపరంజి మీద చెయ్యి చేసుకుంటూ ఉంటాడు.

"అపరంజీ..." అప్పటి వరకు భద్రంగా మూసిన గుప్పెటను తెరిచి ముందుకు చూపిన అపరంజి చేతిలో 'టెటనస్ టెక్సాయిడ్' ఏంప్యూల్ చూడగానే తన హృదయాన్నెవరో పిండేస్తున్నట్టుగా అనిపించింది.

"ఇంజక్షన్ చెయ్యి. ఈ దెబ్బలకు ఏ వాతమో కమ్మిందంటే నా బిడ్డలు అనాథలవుతారు." వణుకుతున్న అపరంజి కంఠం ఏడుపుని లోలోపలే అదిమి

పెడుతూంది. సౌమ్య లేచి తలుపు గెడేసి వచ్చింది.

"దుర్మార్గుడు! ఎంతలాకొట్టేశాడు! అలాంటి పశువుతో కాపురం చేస్తూ ఆ నరకాన్నెలా అనుభవిస్తున్నావే" దెబ్బలకు ఆయింట్‌మెంట్ రాస్తూ కోపంగా అడిగింది సౌమ్య. ఆ ప్రశ్నకు నవ్వింది అపరంజి.

"స్వర్గమో... నరకమో నాకు దక్కిందది. స్వర్గమే కావాలని ఛూజ్ చేసుకునే అవకాశం లేదునాకు. నరకాన్నించి బయటపడి మరిదేన్లో పడాలో తెలియక సరిపెట్టుకుని బ్రతుకు తున్నాను."

'సరిపెట్టుకుని' సౌమ్య రక్తం పొంగుతూంది. తనలో తాను గొణుక్కుంటున్న సౌమ్య వంక ఆశ్చర్యంగా చూచింది అపరంజి.

"ఏం జరిగింది సౌమ్యా? ఎందుకలా వున్నావు." పరిశీలనగా సౌమ్య వంక చూస్తూ అడిగింది అపరంజి.

"నువ్వు సరిపెట్టుకుని బ్రతుకుతున్నానంటే..." సౌమ్యని మధ్యలోనే ఆపేసింది అపరంజి.

"ఏదో క్రొత్త విషయాన్ని వింటున్నట్లు మాట్లాడుతున్నావేమిటే? సరిపెట్టుకుని కాకపోతే సరదాపడి దెబ్బలుతింటూ కాపురం చేస్తున్నననుకుంటున్నావా? సరిపెట్టు కుని కాకపోతే మరో నరమానవుడికి తెలియకుండా నీ దగ్గరకొచ్చి మందులు తీసుకుని ఏమీ జరగనట్లుగా చిరునవ్వులు చిందిస్తూ ఎలా వెళ్ళగలనంటావు. చదువూ, సంపాదించే అవకాశం, నన్నూ నా పిల్లల్నీ కడుపులో పెట్టుకునే మరో దిక్కూలేని నేను సరిపెట్టుకోక చెయ్యగలిగే దేముంది? కాని సౌమ్యా నా మనసు భలే చిత్రమైంది... నాభర్త నన్ను అమానుషంగా బాదుతాడని ఎవరికైనా తెలిస్తే నాకవమానం. నా భర్త దృష్టిలో నేను మనిషిని కాను, పనిచేసే యంత్రాన్ని అనే దారుణమైన నిజం నలుగురికీ తెలియకూడదు. కానీ యంత్రాన్నికూడా అదే పనిగా బాదుతూ వుంటే ఏ పార్టుకాపార్టు విడిపోయి రిపేరు చేసి బాగు చెయ్యలేనంత అధ్వాన్నంగా తయారవుతుందని మా ఆయన లాంటి వాళ్ళకి తెలియదు. ఎప్పుడో ఒకనాడు నీతో మందు రాయించుకుంటానికి, ఇంజక్షన్ చేయించుకోటానికీ కూడా రాలేని స్థితిలో ఉంటానేమో, ఏ తగలగూడని చోటో తగిలి నాబిడ్డల్ని దిక్కులేని వాళ్ళని చేసి పోతానేమోనని నాభయం." హృదయ విదారకంగా ఏడవ సాగింది అపరంజి.

"ఛ... ఏడవకే... అలా అధైర్యపడిపోకే..." సౌమ్య కంఠం దుఃఖంతో పట్టేసింది. కాసేపట్లో దుఃఖాన్ని నిగ్రహించుకుని కళ్లు తుడుచుకుంది అపరంజి.

"సర్లే నాపాడు గొడవ ఎప్పుడూ వుండేదే నీసంగతి చెప్పు... నువ్వదోలా వున్నావు. మీ అమ్మగారూ... సుధక్క కూడా నావంక సీరియస్‌గా చూచి వూరుకున్నారు గానీ మామూలుగా పలకరించలేదు. ఏం జరిగిందసలు?"

శైలేంద్ర విషయం, దిల్షాద్ లెటరు గురించి, నాన్నగారు, అమ్మ,అక్కల మందలింపుల గురించి వివరంగా చెప్పింది సౌమ్య.

"ఐతే ఏం చెయ్యాలని నీ ఉద్దేశ్యం" అపరంజి అడిగింది.

"అదే ఆలోచిస్తున్నాను" ఆలోచిస్తూ ఏదో చెప్పబోయింది సౌమ్య.

"నేనోపని చెప్తాను చేస్తావా"

"ఏమిటే అది?" ఆతృతగా అడిగింది సౌమ్య.

"ఏమీలేదు, నీ ఎం.బి.బి.ఎస్. డిగ్రీని అర్జంట్‌గా పొయ్యిలో పెట్టి తగలెయ్. ఎం.డి.లు ఎమ్.ఎస్‌లు అంటూ నీ టైమ్‌ని, దేశం డబ్బుని వేస్ట్ చెయ్యక శైలేంద్రతోనో, మరో అమరేంద్రతోనో బుద్ధిగా తలవంచి తాళి కట్టించుకుని పట్టుచీరలు, నగలు, కార్లు, భవంతులు... వీటితో సంతృప్తిపడుతూ సంసారం చెయ్యి."

"ఏమిటే నువ్వనేది?" దెబ్బ తిన్నట్లు చూచింది సౌమ్య.

"మీ చదువుకున్న ఆడపిల్లలకసలు బుద్ధిలేదే! ఇంత చదువూ చదువుకుని తగుదునమ్మా అని బొమ్మలా పెళ్లిచూపులకు కూర్చుంటావా? నువ్వూ ఆ మహానుభావుడు శైలేంద్రతో సమానంగా చదువు వెలగబెడుతున్నావే, రేపు నువ్వూ అతనితో సమానంగా సంపాదిస్తావే, లక్షలు పెట్టి మొగుడ్ని కొనుక్కుని గ్రాండ్‌గా పెళ్లి చేయమని అడగటానికి నీకు సిగ్గుగా లేదూ?" అపరంజి చెరుగుడు విని నిర్ఘాంతపోయింది సౌమ్య.

"నేనేమీ గ్రాండ్‌గా చెయ్యమని అడగడం లేదు" రోషంగా అంది సౌమ్య.

"నీసంగతి కాదు, నీలాంటి ఆడపిల్లల సంగతి నేను చెప్తూంట. మీనాన్న గారితో అంత చిన్నమాట అనగల ధైర్యం నీకుంటే యింకెందుకు? నిన్ను కోరి కళ్ళల్లో పెట్టుకుని పూజించుకునే రఘువీర్‌నే చేసుకునేదానివి. ఆ అవలక్షణ

కుమారుడు శైలేంద్రని చేసుకోనని తెగేసి చెప్పేదానివి... మరో ఆలోచన లేకుండా, సరిపెట్టుకోవల్సిన ఖర్మ నాకేమిటని మీ అమ్మ నోరూ, అక్కనోరు మూయించే దానివి. సౌమ్యా! చదువుకున్న నీలాంటి ఆడపిల్లలు ఎదిరించకపోతే, అమ్మమ్మలా, అమ్మలా, అక్కలా నేనూ సర్దుకు పోతాననే స్టేజిలోనే వుండిపోతే ఆడపిల్లల బ్రతుకులు రవ్వంతయినా బాగుపడతాయా? మగవాడి బలహీనతలన్నిటినీ సహజ విషయాలుగా తీసుకుని క్షమించి సర్దుకు పోయే ఆడవాళ్ళున్నంత కాలం మగవాళ్ల బలహీనతలు పెరుగుతూనే వుంటాయే... ఆ బలహీనతలకు లక్షలాది అపరంజిలు బలవుతూనే వుంటారే!'' చివరి మాట చెప్తూంటే అపరంజి కళ్ళలో చివ్వున నీళ్ళు చిమ్మాయి. ఎన్ని రోజుల నుండో లోలోపల రగులుతున్న ఆలోచనల్ని బయట పెడుతున్న అపరంజి వంక మౌనంగా చూస్తూంది సౌమ్య.

“మగవాడి బలహీనతల కంటే హీనమైనవి మీ చదువుకున్న అమ్మాయిల పిరికితనం, రాజీ పడిపోయే ప్రవృత్తి. సౌమ్యా! నేనొకటడుగుతాను... నిజం చెప్పు.''

ఏమిటన్నట్లు చూచింది సౌమ్య.

“శైలేంద్ర గుణగణాలు తెలిసికూడ అమ్మ, అక్క చెప్పినట్లు సర్దుకు పోదామా, మానేద్దామా అని గుంజాటన పడుతున్నావే, నువ్వు కొంచెం రాష్ అమ్మాయివని అతని కెవరైనా చెప్తే ఇంతసేపు ఆలోచిస్తాడా అతను? మరుక్షణం అలాంటి పిల్ల నాకొద్దు, పరమపతివ్రతే కావాలని కుండబ్రద్దలుగొట్టినట్లు చెప్తాడు. సౌశీల్యం, సౌజన్యం వున్న వ్యక్తిని కోరుకునే అర్హత నిజానికి అతని కంటే నీకే ఎక్కువుంది.''

ప్రశ్న, జవాబు తనే చెప్పుకుంటూ ఆవేశంగా మాట్లాడుతున్న అపరంజి వంక చిత్రప్రతిమలా చూస్తూ వుండిపోయింది సౌమ్య.

“ఒక్క డబ్బు విషయంలో తప్ప, అతని తండ్రి హోదా విషయంలో తప్ప రఘువీర్ శైలేంద్ర కంటే దేన్లో తక్కువ? ఇన్ని సంవత్సరాలుగా నీ క్లాస్‌మేట్‌గా, నిన్నారాధించే వ్యక్తిగా అతను నీకు తెలుసు. మీ అక్క చెప్పే నాగరికత అంటని వ్యక్తి. అలాంటి వాడిని కాలదన్నుకుని శైలేంద్రను చేసుకుందామా, మానదామా అని యింకా నువ్వాలోచిస్తున్నావంటే అది నీ ఖర్మే'' సౌమ్య నెత్తిమీద చిన్నగా మొట్టి నవ్వింది అపరంజి.

“అబ్బ? ఆపవే, ఆ శైలేంద్రని ఎప్పుడో గెంటేశాను నా మనసులోంచి. నా మాట వినిపించుకోకుండానే పెద్ద లెక్చరిచ్చేశావు, సరే, వినకపోతే ఏడ్చుకుపోతావు... పోన్లెమ్మని విన్నాను''చిలిపిగా నవ్వింది సౌమ్య.

"లెక్చర్ కాదే... మీ చదువుకున్న ఆడపిల్లలకు నా విన్నపాన్ని తెలుపుకుంటున్నాను. 'అమ్మా! చదువుతో మీ వెన్నెముకను కాస్త నిలబెట్టుకుని, వ్యక్తిత్వం వున్న మనుషుల్లాగ ప్రవర్తించండి. బ్రతుకుతో రాజీ పడిపోవటం కాదు - మీకు న్యాయంగా రావలసినదాన్ని పోట్లాడి మరీ సంపాదించుకోండి. స్త్రీ సహనశీలీ... క్షమాశీలీ... స్త్రీత్వమంటే సర్దుకుపోయి అందర్నీ ఆనందపెట్టడమే' అనే దొంగ కబుర్లకి లొంగిపోయి మగవాడినింకా బలహీనతల పుట్టను చేయకండి. మగవాడిని మానవత్వమున్న మనిషిగా - ఉన్నతుడిగా నిలిపే శక్తిగల స్త్రీత్వాన్ని మీరైనా పెంపొందించుకోండి... అని వేడుకోవాలనుకుంటున్నాను."

నవ్వుతూ అపరంజి వంక చూస్తున్న సౌమ్య - "ఏమిటే... చదువుకున్న ఆడపిల్లలేమైనా ఆకాశంనుంచి ఊడిపడ్డారా?" అంది.

"ఊడిపడకపోవచ్చు. కాని, చదువూ... సంపాదనా... కాళ్ళని స్థిరంగా నిలిపేందుకు శక్తినిస్తాయి. ఆ శక్తి లేని నాలాంటి వాళ్ళు స్వతంత్రంగా నిలబడాలని ప్రయత్నంచేస్తే చతికిలబడతాం. దెబ్బ తగలడం తప్ప ఫలితముండదని తెలిసే ఇలా సరిపెట్టు కోవడం... ఇలా ఏడుస్తూ నవ్వడం. ఇంతకూ..." ఆగి సౌమ్యవంక పరిశీలనగా చూసింది అపరంజి.

"శైలేంద్రకు గుడ్‌బై - రఘువీర్‌కి" అపరంజి మధ్యలోనే అందుకుని-

"వెల్‌కమ్ కదూ!"

"ఇంతసేపు నీతో బ్రెయిన్‌వాష్ ఇప్పించుకున్నాక కూడా ఇంకా అనుమానంగా చెప్పనా?" నవ్వింది సౌమ్య.

"ఇప్పుడు నచ్చావు నాకు."

సౌమ్య వంక చూస్తున్న అపరంజి కళ్ళల్లో ప్రశంస, విన్నపాలేకాదు, ఆశలు కూడా జ్వలిస్తున్నాయి. ఆ జ్వాలలు సౌమ్య గుండెను సోకి అప్పటివరకు రూపుదిద్దుకుంటున్న చైతన్యగీతానికి స్వరకల్పన చేసాయి.

*సౌమ్య, 1980.*